సాక్షి
రంగారెడ్డి

శుక్రవారం । 24 । నవంబర్ । 2023



ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనసందోహం

## న్యూస్‌రీల్

### శభాష్.. ప్రదీప్
పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్



ప్రదీప్‌ను సన్మానిస్తున్న రమేష్‌రాజు తదితరులు

ఇబ్రహీంపట్నం: ప్రపంచ స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన ప్రదీప్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. ఇబ్రహీంపట్నంలో పుట్టి, పెరిగిన ప్రదీప్.. రాచకొండ కమిషనరేట్‌లో అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్‌గా పనిచేస్తూ నగరంలో నివాసముంటున్నాడు. ఈనెల 18న కిరిగిస్తాన్ దేశంలోని బిస్కెక్ నగరంలో జరిగిన ప్రపంచ స్థాయి ఓపెన్ వరల్డ్‌కప్–2023 పోటీల్లో 82.5 వెయిట్ కేటగిరిలో 422.5 కిలోల బరువు ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించాడు. ఇండియాకు తిరిగివచ్చిన ప్రదీప్‌ను గురువారం లయన్స్ క్లబ్ సెక్రటరీ రమేష్‌రాజుతోపాటు పలువురు ఘనంగా సన్మానించారు.

### నేడు కందుకూరులో మంత్రి సబిత ప్రచారం

కందుకూరు: కందుకూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం మంత్రి సబితారెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని జెడ్పీటీసీ జంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటలకు నేదునూరుతో ప్రారంభమై దాసర్లపల్లి, దాసర్లపల్లితండా, సాయిరెడ్డిగూడ, ముచ్చర్ల, సార్లరావులపల్లి, దెబ్బడగూడ, కందుకూరులో ప్రచారం చేస్తారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

### ఓటర్ స్లిప్‌పై క్యూఆర్ కోడ్



కేశంపేట: ఈ దఫా రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ స్లిప్పులను క్యూఆర్ కోడ్‌తో ముద్రించాయి. ఈ క్యూర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా వ్యక్తి వివరాలతో పాటు పోలింగ్ స్టేషన్ వివరాలు తెలుస్తాయి. గతంలో ఓటర్ స్లిప్పులో ఓటర్ పేరు, వివరాలతో పాటు ఫొటోను ముద్రించేవారు. ప్రస్తుతం క్యూర్ కోడ్‌ను ముద్రించి ఓటర్లకు అందిస్తున్నారు.

### జాతీయ ఐస్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక



చాణస్య గౌడ్

పహాడీషరీఫ్: జనవరి–2024లో జరిగే జాతీయ ఐస్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు రంగారెడ్డి జిల్లా మామిడిపల్లికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ కుమార్తె ఈరంకి చాణస్యగౌడ్ ఎంపికయ్యింది. ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత నెల గురుగ్రామ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ ఐస్ స్కేటింగ్‌లో చాణస్య అండర్–9 విభాగంలో పోటీచేసి షార్ట్ బ్లేడ్‌లో రజతం సాధించింది. ఆమె ప్రతిభను గుర్తించిన నిర్వాహకులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జాతీయ పోటీల్లో చాణస్య ప్రతిభపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రజలకు నమస్కారం చేస్తున్న సీఎం కేసీఆర్, మంత్రి సబితారెడ్డి

# ప్రశంసల ‘వర్షం’

ఓవైపు ఏకధాటి వర్షం.. మరోవైపు మంత్రి సబితపై సీఎం కేసీఆర్ కురిపించిన ప్రశంసల జల్లు.. వెరసి సుల్తాన్‌పూర్‌లో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభ సూపర్ సక్సెస్ అయ్యింది. మహేశ్వరం బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డిని సీఎం కేసీఆర్ పొగడ్తలతో ముంచెత్తారు. రాజకీయాల్లో ఆమెకున్న అనుభవం, మంత్రిననే గర్వం లేకపోవడం, ఓ సామన్య కార్యకర్తలా నిత్యం ప్రజలతో మమేకమై పోవడం, ఓపిక, హుందాతనం, అభివృద్ధి, ప్రజా సంక్షేమం పట్ల ఆమెకున్న నిబద్ధత చాలా తక్కువ మంది నాయకుల్లో ఉంటుందని అభివర్ణించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే సబిత విజయం ఇప్పటికే ఖరారైందని చమత్కరించడంతో ప్రజలు పెద్ద ఎత్తున చప్పట్లతో హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. జై కేసీఆర్.. జై సబితమ్మ నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది.

సాక్షి, రంగారెడ్డిజిల్లా/పహాడీషరీఫ్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మహేశ్వరం నియోజకవర్గం సుల్తాన్‌పూర్‌లో మంత్రి సబితారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ అద్యంతం ఉత్సాహంగా కొనసాగింది. ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లు ఉదయం నుంచి కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మీర్‌పేట్, బడంగ్‌పేట్, జల్‌పల్లి, కందుకూరు, మహేశ్వరం తదితర ప్రాంతాల నుంచి కార్యకర్తలు, అభిమానులు సుల్తాన్‌పూర్ సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం 1:20నిమిషాలకు సీఎం కేసీఆర్ హెలిపాడ్‌లో సభాస్థలికి చేరుకున్నారు. అప్పటివరకు తెలంగాణ ధూంధాంతో దద్దరిల్లిపోయిన సభా ప్రాంగణం సీఎం రాకతో ఒక్కసారిగా జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో హోరెత్తింది. సభలో సీఎం కేసీఆర్ సుమారు 25 నిమిషాల పాటు ప్రసంగించారు. అయితే ఆయన ప్రసంగం మొత్తం మంత్రి సబిత చుట్టే కొనసాగింది. సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరైన జనాన్ని చూసి సబిత గెలుపు ఇప్పటికే ఖాయమైందని చెప్పారు. ప్రజా సమస్యలపై ఆమెకున్న నిబద్ధత, ఓర్పు చాలా తక్కువ మంది నేతల్లో ఉంటుందన్నారు. నిత్యం అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడే సబితారెడ్డిని ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

**ట్రాఫిక్ మళ్లింపు..**

ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని పోలీసులు సభకు వచ్చే ప్రధాన రూట్లలో ఆంక్షలు విధించారు. చాంద్రాయణగుట్ట నుంచి శ్రీశైలం వైపు వెళ్లే వాహనాలను పహాడీషరీఫ్ పాత గ్రామం మీదుగా మళ్లించారు. బాలాపూర్ నుంచి వచ్చిన వాహనాలను మల్లాపూర్ వరకే పరిమితం చేశారు.రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్.చౌహాన్, మహేశ్వరం, ఎల్బీనగర్ డీసీపీ శ్రీనివాస్, సాయిశ్రీ పర్యవేక్షణలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రతి కార్యకర్తను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే సభా ప్రాంగణంలోకి పంపించారు.

**సంక్షేమం, అభివృద్ధి చూసి ఆదరించండి..**

సభలో మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిదిన్నరేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇచ్చిందని అన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఏ ఇంటి గడప తొక్కినా పార్టీలకతీతంగా బీఆర్‌ఎస్‌ను, తనను ఆశీర్వదిస్తున్నారని తెలిపారు.

**మంత్రి సబితారెడ్డిని ఆకాశానికెత్తిన సీఎం**

- సామాన్య కార్యకర్తగా నిత్యం ప్రజల మధ్యనే
- భూదేవికున్నంత ఓపిక ఆమె సొంతం
- మహేశ్వరం ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్
- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సభకు పోటెత్తిన జనం

నాలుగున్నరేళ్ల కాలంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నియోజకవర్గంలో రూ.2వేల కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాని చెప్పారు. రోడ్ల విస్తరణ, చెరువుల సుందరీకరణ, నాలాల అభివృద్ధి, అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేశామన్నారు. విద్య, వైద్య రంగాలకు కూడా పెద్ద పీట వేశామన్నారు. ఎనిమిది గురుకులాలు, మూడు డిగ్రీ కళాశాలలు, ఒక లా కళాశాల, మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశామన్నారు. మెడికల్





ప్రసంగిస్తున్న మంత్రి సబితారెడ్డి

కళాశాలకి సంబంధించి 450 పడకల ఆస్పత్రి కూడా త్వరలో అందుబాటులోకి వస్తుందన్నారు. 21 బస్తీ దవాఖానాలు, యూపీహెచ్‌సీలను ఏర్పాటు చేశామన్నారు. బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లు, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీల్లో రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయడంతో పాటు నియోజకవర్గంలో తనను ఆశీర్వదించాలని ప్రజలను మంత్రి కోరారు. కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, మీర్‌పేట్ మేయర్ దుర్గ తదితరులు హాజరయ్యారు.

**దుమ్మురేపిన ధూంధాం**

మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి సభా ప్రాంగణం వద్ద బతుకమ్మ ఆడి పాడారు. కళాకారులు ఆలపించిన తెలంగాణ గీతాలు, ధూంధాం నృత్యాలు కార్యకర్తల్లో జోష్‌ను నింపాయి. ‘గులాబీలా జెండాలే రామక్క’ పాటకు వేదికపై ఉన్న మంత్రి సబితా రెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో పాటు సభలోని కార్యకర్తలు బీఆర్‌ఎస్ జెండాలు ఊపుతూ హోరెత్తించారు.

# ‘హస్తం’ జోష్

- మహేశ్వరం ప్రచారంలో దూసుకుపోతున్న కేఎల్లార్
- ఆరు గ్యారెంటీలతో అన్నివర్గాలను ఆకట్టుకునే యత్నం
- భట్టి, రేవంత్ సభలతో నేతల్లో నూతనోత్సాహం





మహేశ్వరం అభ్యర్థి కేఎల్లార్‌కు మద్దతుగా ఆర్‌కేపురంలో ప్రచారం చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

తుక్కుగూడ: అసెంబ్లీ ఎన్నికల బరిలో కాంగ్రెస్ పార్టీ నుంచి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) బరిలో నిలవడంతో ఆ పార్టీ నేతల్లో ఎన్నడూ లేని జోష్ కనిపిస్తోంది. చాపకింద నీరులా హస్తం పార్టీ రోజురోజుకు ప్రజల్లోకి చొచ్చుకుపోతోంది. ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, మైనారిటీ, బీసీ డిక్లరేషన్లను ప్రజల్లోకి తీసుకుపోవడంతో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో కేఎల్‌ఆర్ తనదైన స్టైల్ చూపిస్తున్నారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు.

**మైనార్టీలపై ప్రత్యేక ఫోకస్..**

మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో సుమారు లక్ష వరకు మైనార్టీ ఓటర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మైనార్టీ డిక్లరేషన్‌ను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. మైనార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి ఆ వర్గాలను ఆకట్టుకునే ప్రయత్నంలో సఫలమయ్యారనే చెప్పవచ్చు. దీంతోపాటు బీజేపీ, బీఆర్‌ఎస్‌కి చెందిన అసంతృప్త నేతలపై ఆయన ప్రధానంగా ఫోకస్ చేశారు. గత వారం రోజులుగా ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు జరుగుతున్నాయి.

**భట్టి, రేవంత్ సభలతో నూతనోత్సాహం**

కేఎల్‌ఆర్ ఇప్పటికే నియోజకవర్గంలోని తుక్కుగూడ, జల్‌పల్లి, బడంగ్‌పేట, మీర్‌పేట, కందుకూరు, మహేశ్వరం, ఆర్‌కేపురం, సరూర్‌నగర్‌లో ప్రచారం చేపట్టారు. ఇటీవల నియోజకవర్గంలో సీఎల్పీ నేత భట్టి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రచారం చేయడంతో ఆ పార్టీ నేతల్లో మరింత జోష్ పెరిగింది. ఈసారి మహేశ్వరంలో హస్తం పార్టీ జెండా ఎగురవేస్తామని కేఎల్‌ఆర్ ధీమాగా ఉన్నారు.

# యంగ్ తరంగ్ !

- గ్రేటర్‌లో 1.70 లక్షల మంది యువ ఓటర్లు
- వీరిని ఆకట్టుకునేందుకు సోషల్ మీడియా వేదిక అభ్యర్థుల ప్రచారం
- హైదరాబాద్‌లో 77.522, రంగారెడ్డిలో 92.540 తొలిసారి ఓటర్లు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో యంగ్ తరంగ్ ఓటు అనే వజ్రాయుధంతో దూసుకొస్తోంది. ఈ నెల 30న జరగనున్న శాసనసభ ఎన్నికలలో తొలిసారి ఓటు వేసేందుకు యువతరం ఉరకలేస్తోంది. వీరు ఎటు మొగ్గు చూపితే ఆ అభ్యర్థులే విజయం సాధిస్తారనడంలో సందేహం అక్కర్లేదు. అభ్యర్థులు నచ్చకపోతే నోటాను నొక్కే అవకాశం ఉండటంతో అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. ఉద్యోగ అవకాశాలు, మౌలిక వసతుల కల్పనే వీరి ప్రధాన అజెండా. దీంతో వీరిని ఆకట్టుకునేందుకు ప్రధాన పార్టీలు సోషల్‌మీడియావేదికగా తెగ ప్రచారం చేస్తున్నాయి.

**గ్రేటర్‌లో 1.70 లక్షల మంది ఓటర్లు..**

రాష్ట్రంలో 18–19 ఏళ్ల మధ్య వయసు ఉన్న యువ ఓటర్లు 8,11,640 మంది ఉన్నారు. ఇందులో గ్రేటర్ వాటా 1.70 లక్షలు. అత్యధికంగా రంగారెడ్డిలో 92,540, హైదరాబాద్‌లో 77,522 మంది యువత రానున్న అసెంబ్లీ ఎన్నికలలో తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గ్రేటర్‌లోని చాలా నియోజకవర్గాలలో ఈ తొలి ఓట్లే అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో కీలకంగా మారాయి.

**ఉచిత విద్య, వైద్యానికే మొగ్గు..**

మౌలిక సదుపాయల అభివృద్ధి, ఉద్యోగ అవకాశాల, జాబ్ కేలండర్‌లకు మేనిఫెస్టోలో ప్రాధాన్యం ఇచ్చిన పార్టీలకే యువతరం మొగ్గు చూపించే అవకాశాలున్నాయి. దీంతో పాటు ఉచిత విద్య, వైద్యం కల్పించే పార్టీలకు జైకొడతామని పేర్కొంటున్నారు. ప్రజాధనం దుర్వినియోగం, స్కామ్‌లు, అవినీతి వంటి వాటిపై సామాజిక మాధ్యమాల వేదికగా ప్రశ్నిస్తున్నారు. ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగామ్ వంటి సామాజిక మాధ్యమాల వేదికగా షార్ట్ వీడియోలు, రీల్స్ చేస్తూ జోరుగా ప్రచారం చేస్తున్నాయి. బస్తీలు, కాలనీల్లోని యువ ఓటర్లను ఆకర్షించేందుకు క్రికెట్ కిట్లు, పండుగలకు సాంస్కృతిక కార్యక్రమాలు, యువతుల కోసం ఎలక్ట్రిక్ వాహనాలు, స్మార్ట్ వాచ్‌లు వంటివి పంపిణీ చేస్తున్నారు.

# ముక్కోణపు పోటీ

- అతిపెద్ద నియోజకవర్గంగా శేరిలింగంపల్లి
- వ్యూహ ప్రతివ్యూహాల్లో బీఆర్‌ఎస్,కాంగ్రెస్, బీజేపీ
- హ్యాట్రిక్ విజయం సాధిస్తామంటున్న ఆరెకపూడి గాంధీ
- కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని జగదీశ్వర్ గౌడ్ ధీమా
- కమల వికాసం ఖాయమంటున్న రవికుమార్ యాదవ్



కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్

బీఆర్‌ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ

బీజేపీ అభ్యర్థి రవికుమార్ యాదవ్

గచ్చిబౌలి: ఐటీ కంపెనీలకు నిలయంగా ఉన్న శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 29 రాష్ట్రాలకు చెందిన ఓటర్లు ఉన్నారు. టెకీలతో పాటు ఐటీ నిపుణులు, అక్షరాస్యుల సంఖ్య కూడా ఎక్కువే. 600కుపైగా ఐటీ కంపెనీలు వందలాది హోటళ్లు ఉన్నాయి. ఐటీ, ఐటీ ఆధారిత ఉద్యోగులు, ఆతిథ్య రంగంలోనూ ఉద్యోగులుగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువగా ఉంటారు. దేశలోని అన్ని రాష్ట్రాల నుంచి, తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలకు చెందిన వారు నియోజకవర్గంలో ఉన్నారు. దేశంలోని అన్ని భాషలు మాట్లాడే వారు, వివిధ రాష్ట్రాలకు చెందిన ఫుడ్ కోర్టులు ఉన్నాయి. భిన్న సంస్కృతులకు నిలయమైన శేరిలింగంపల్లి మినీ భారత్‌గా చెప్పవచ్చు. ఈ నియోజకవర్గంలో అభ్యర్థులే కాదు కుబేరులైన ఓటర్లకూ కొదవలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుంచి ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. గెలుపు తమదంటే తమదంటూ మూడు పార్టీల అభ్యర్థులూ ధీమా వ్యక్తంచేస్తున్నారు. ఒక్కసారి ఈ నియోజవర్గంపై దృష్టి సారిస్తే..

**అందరి చూపు.. శేరిలింగంపల్లి వైపే..**

దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గాల్లో శేరిలింగంపల్లి ఒకటి. ఇక్కడ మొత్తం 7,32,506 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 3,88,482, మహిళలు 3,43,875, ఇతరులు 149 మంది ఉన్నారు. ఉత్తర భారతీయుల ఓట్లు దాదాపు లక్షన్నర ఉన్నట్లు అంచనా. సీమాంధ్రకు చెందిన దాదాపు 2 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. స్థానిక ఓటర్లు, మైనార్టీ ఓటర్లు భారీ సంఖ్యలో ఉన్నారు.

**ఎవరి ధీమా వారిదే..**

బీఆర్‌ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ తన సామాజిక ఓటర్లతో పాటు, మైనార్టీ ఓటర్లపై నమ్మకం పెట్టుకున్నారు. ఆయన 2014లో టీడీపీ నుంచి 80 వేల మెజారిటీతో, 2018లో టీఆర్‌ఎస్ నుంచి 42 వేల ఓట్లతో గెలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్ మూడు సార్లు కార్పొరేటర్‌గా పని చేయడంతో మాదాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్లలో మంచి పట్టు ఉంది.బీజేపీ అభ్యర్థి రవి కుమార్ యాదవ్ నార్త్ ఇండియన్స్ ఓట్లపై నమ్మకం పెట్టుకున్నారు. 50 వేలకు పైగా నార్త్ ఇండియన్స్ ఓట్లను ఎన్‌రోల్ చేయించారు. నార్త్ ఇండియన్స్‌తో పాటు తన సామాజిక వర్గం ఓట్లు, తన తండ్రి మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ అదనపు బలంగా చెప్పుకుంటున్నారు.

**ఢీ అంటున్న కుబేరులు**

శేరిలింగంపల్లిలో పోటీ పడుతున్న ప్రధానపార్టీలకు చెందిన ముగ్గురు అభ్యర్థులు కుబేరులే. అభ్యర్థులు ప్రచారంలో పోటీ పడుతూ ఢీ అంటే ఢీ అన్నట్లు వ్యవహరిస్తున్నారు. రోడ్ షోలకు పోటీపడి జన సమీకరణ చేయడం గమనార్హం. పెద్ద నియోజకవర్గం కావడంతో అభ్యర్థుల ఖర్చు కూడా భారీ మొత్తంలో ఉంటుందనే చర్చ జరుగుతోంది.



**• హస్తందే హవా**

కడ్తాల్ రోడ్‌షోలో ప్రచార రథం నుంచి ప్రసంగిస్తున్న కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి



**• కిషనన్నకు జై..**

ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన రోడ్‌షోలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి జై కొడుతున్న ప్రజలు



**• సాదర స్వాగతం**

యాచారం మండలం గడ్డమల్లయ్యగూడలో కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డికి ఘన స్వాగతం పలుకుతున్న మహిళలు

## ప్రపంచ విధాన సదస్సులో తెలంగాణ వాసి

లక్డీకాపూల్: విభిన్న అంశాలపై దుబాయిలో నిర్వహించిన ప్రపంచ విధాన సదస్సులో తెలంగాణ వాసి, సోషల్ ఎంట్రప్రెన్యూర్ మను మల్లిఖార్జున్ పాల్గొన్నారు. దుబాయిలో బుధవారం జరిగిన ఈ సదస్సులో తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ మల్లిఖార్జున్ తనయుడితో పాటు పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్ ఎంకే నారాయణన్ పాల్గొన్నారు. ఈ సదస్సు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఏఐ, గ్లోబల్ హెల్త్, ఆహార భద్రత, ఉక్రెయిన్ యుద్ధం సమస్యలపై చర్చించారు.



## ఎమ్మెల్యే జైపాల్‌కు చుక్కెదురు

- ప్రచారం అడ్డుకున్న గిరిజనులు
- అభివృద్ధిపై నిలదీత

ఆమనగల్లు: ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను తండావాసులు అడ్డుకున్నారు. ఈ సంఘటన ఆమనగల్లు మండలం శంకరకొండతండాలో గురువారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బీఆర్‌ఎస్ కల్వకుర్తి అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేయడానికి శంకరకొండ తండాకు వెళ్లగా.. గిరిజనులు అడ్డగించారు. మేడిగడ్డతండా–శంకరకొండతండా రోడ్డులో ఉన్న కత్వ వాగుపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏడాదిన్నర గడిచినా ఎందుకు నిర్మించలేదని నిలదీశారు. బ్రిడ్జి లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని మండిపడ్డారు. బ్రిడ్జి కోసం రెండుసార్లు నిరాహార దీక్ష చేసినా పట్టించుకోలేదని, ఇప్పుడు ఎందుకు వచ్చావని ఆగ్రహించారు. ఆందోళనకారులకు పార్టీ నాయకులు సర్దిచెప్పబోగా.. ససెమిరా అన్నారు. ఎమ్మెల్యే ప్రసంగిస్తుండగా.. జై కాంగ్రెస్, జై బీజేపీ, భారత్‌మాతాకి జై అంటూ నినదించారు. దీంతో అక్కడ కొద్దిసేపు గందరగోళ వాతావరణం చోటుచేసుకుంది. అక్కడే ఉన్న పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని అక్కడి నుంచి తీసుకువెళ్లగా.. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తన ప్రసంగం ముగించుకుని వెళ్లిపోయారు. ప్రచారం కోసం దయ్యాలబోడుతండాకు వెళ్లాల్సిన ఎమ్మెల్యే.. అక్కడ ఇలాంటి పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉండటంతో వెళ్లలేదు.



ఎమ్మెల్యే ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న గిరిజనులు



కాలె యాదయ్య, బీఆర్‌ఎస్ | భీంభరత్, కాంగ్రెస్ | కేఎస్ రత్నం, బీజేపీ

# చేవెళ్ల బాద్‌షా ఎవరో?

కాంగ్రెస్ కంచుకోటలో త్రిముఖ పోటీ!

- హాట్రిక్ విజయంపై యాదయ్య నజర్
- 'హస్త'గతానికి భీం పట్టు
- కమలం 'రత్నం' వికసించేనా?

నవాబుపేట: గత రెండు పర్యాయాలుగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రమంతా ఒకవైపు పవనాలు వీస్తే.. చేవెళ్లలో మాత్రం మరో వైపు వీచాయి. 2008లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా వికారాబాద్ నియోజకవర్గంలో ఉన్న నవాబుపేట మండలాన్ని చేవెళ్లలో కలిపారు. అప్పటి వరకు జనరల్‌గా ఉన్న చేవెళ్ల అసెంబ్లీ స్థానం.. ఎస్సీకి రిజర్వుడ్ అయ్యింది. నవాబుపేట మండలంలో ఎస్సీ జనాభా అధికంగా ఉండటంతోనే.. చేవెళ్లను ఆ సామాజిక వర్గానికి కేటాయించారు. పునర్విభజన అనంతరం 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో రాష్ట్రమంతా హస్తం హవా కొనసాగగా.. చేవెళ్లలో మాత్రం టీడీపీ అభ్యర్థి కేఎస్ రత్నం గెలిచారు.

**కాంగ్రెస్ కంచుకోట..**

నియోజకవర్గాల పునర్విభజనకు ముందు చేవెళ్ల కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేది. మాజీ మంత్రి ఇంద్రారెడ్డి, మాజీతాజా మంత్రి సబితారెడ్డిలకు తిరుగు ఉండేది కాదు. దీంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేవెళ్లను సెంటిమెంటుగా భావించే వారు. ఏ కార్యక్రమం చేపట్టినా అక్కడి నుంచే మొదలు పెట్టేవారు. అలాంటి సెగ్మెంట్‌ను ఎస్సీకి కేటాయించడంతో కాంగ్రెస్ కంచుకోటకు బీటలు వారాయి. తొలి సారిగా టీడీపీ అభ్యర్థి కేఎస్‌రత్నం .. కాంగ్రెస్ అభ్యర్థి కాలె యాదయ్యపై 2,250 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. అనంతరం కేఎస్ రత్నం టీడీపీకి రాజీనామా చేసి, 2014 సాధారణ ఎన్నికలకు మూడు నెలల ముందు టీఆర్‌ఎస్‌లో చేరారు. దాంతో నాటి అసెంబ్లీ ఎన్నికల్లో కేఎస్.. టీఆర్‌ఎస్ తరుపున పోటీ చేయగా.. కాలె రెండో సారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఈ సారి కూడా తెలంగాణ మొత్తం గులాబీ జెండా ఎగరగా.. చేవెళ్ల ప్రజలు మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి కాలె యాదయ్యను 681 ఓట్ల ఆధిక్యంతో గెలిపించారు. కాంగ్రెస్ తరుపున ఎమ్మెల్యేగా గెలుపొందిన కాలె.. ప్రతి పక్షంలో ఉంటే నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిపోతుందని, నమ్మిన ప్రజలకు మేలు జరగదని భావించి బీఆర్‌ఎస్‌లో చేరారు.

**2018లో ఇరువురు పోటీ**

2018 ఎన్నికలకు ముందు వరకు కాలె యాదయ్య ఎమ్మెల్యేగా, కేఎస్ రత్నం టీఆర్‌ఎస్‌లో ఉన్నారు. మళ్లీ టీఆర్‌ఎస్ టికెట్ ఆశించిన రత్నంకు టికెట్ ఇవ్వకుండా, సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న యాదయ్యకే అధిష్టానం టికెట్ ఇచ్చింది. దాంతో కేఎస్ రత్నం టీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్ నుంచి టికెట్ దక్కించుకొని బరిలోకి దిగారు. అయినా చేవెళ్ల ప్రజలు మరోసారి యాదయ్యకే పట్టం కట్టారు. దాంతో యాదయ్య మొదటగా కాంగ్రెస్ తరుపున, రెండోసారి టీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిపొందారు.

**తుదితీర్పు ప్రజానికానిదే..**

ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి కాలె యాదయ్య, బీజేపీ నుంచి కేఎస్ రత్నం, కాంగ్రెస్ నుంచి పామెన భీంభరత్ చేవెళ్ల బరిలో నిలిచారు. దీంతో త్రిముఖ పోటీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో గతంలో కాంగ్రెస్‌కు కంచుకోట అయిన చేవెళ్లపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ పెద్దలు పట్టుబట్టినట్లు తెలుస్తోంది. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన యాదయ్య మూడో సారి గెలిచేందుకు పట్టుదలతో ముందుకు వెళ్తున్నారు. ఈ సారి ఎలాగైనా గెలిచి తన సత్తా చాటాలని కేఎస్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఏది ఏమైనా.. తుదితీర్పు ప్రజానికానిదే. చేవెళ్ల బాద్ షాగా ఎవరిని నిలబెడతారో చూడాలి మరి..

# కల్వకుర్తిని పట్టించుకోని ప్రభుత్వం

- సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే విఫలం
- నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం
- కాంగ్రెస్ కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి



పార్టీలో చేరిన వారితో కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కల్వకుర్తి అన్ని రంగాల్లో వెనుకబడిందని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ కల్వకుర్తి అసెంబ్లీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఎన్నికల పర్యటనలో భాగంగా ఆయన గురువారం మండల పరిధి చిన్న వేములోని బావితండా, పెద్దావేములోని బావితండా, మైసిగండి, గడ్డమీదితండా, వెలుగురాళ్ల తండాల్లో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, వైఎస్‌ఆర్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డిలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రస్తుత ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కల్వకుర్తిని పట్టించుకోలేదని, మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. నియోజకవర్గంలో నెలకొన్న సాగునీటి సమస్య తీర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయలేదని, విద్యావైద్యాన్ని విస్మరించారని విమర్శించారు.

**ఇందిరమ్మ రాజ్యం**

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని కసిరెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ గెలిస్తే.. ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలతో పాటు, మేనిఫెస్టోలో పొందుపరచిన స్కీంలు అమలు అవుతాయని పేర్కొన్నారు. శ్రీనివాస్‌గౌడ్, అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజా సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటువేసి పార్టీని గెలిపించాలని కోరారు. ఇదిలా ఉండగా.. మైసిగండిలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన 150 మంది కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సేవ సంఘం రాష్ట అధ్యక్షుడు హన్మానాయక్, నాయకులు జహంగీర్‌అలీ, యాదగిరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ పాండునాయక్, వినోద్, హీరాసింగ్, అమర్‌సింగ్, కిషన్, శేఖర్‌గౌడ్, జవహర్‌లాల్, గోపి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## మంచిరెడ్డి గెలుపుకోసం మౌనికారెడ్డి ప్రచారం



బాటసింగారంలో మౌనికారెడ్డి ప్రచారం..

అబ్దుల్లాపూర్‌మెట్: ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోడలు మౌనికారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలో ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను చూసి కారు గుర్తుకు ఓటు వేసి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా మంచిరెడ్డిని గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లతాశ్రీ పాల్గొన్నారు.

## కాప్రా వరకు మెట్రో ఏర్పాటు

మల్లాపూర్ రోడ్ షోలో మంత్రి కేటీఆర్



మల్లాపూర్ రోడ్ షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

మల్లాపూర్: నగరంలో 35 పై ఓవర్లు మనం పూర్తి చేసుకుంటే.. ఒక్క జాతీయ రహదారిని పూర్తి చేయలేని బీజేపీ నాయకులు సిగ్గు..శరం లేకుండా ఓట్లు అడగటానికి వస్తున్నారని మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతుగా మల్లాపూర్‌లో గురువారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..రానున్న రోజుల్లో రూ. 20 వేల కోట్లతో ఉప్పల్‌లో మూసీనది పక్షాళన, అండర్ డ్రైనేజీ, వరద నీటి కాలువలు, ఉప్పల్, హబ్సిగూడ, మల్లాపూర్, కాప్రా, ఈసిఐఎల్ వరకు మెట్రో ఏర్పాటు చేసుకుందామన్నారు. రూ.400కే గ్యాస్ సిలిండర్, సౌభాగ్య లక్ష్మి పేరుతో 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడ బిడ్డకు రూ.3 వేలు, ప్రతి కుటుంబానికి సన్న బియ్యం, కేసీఆర్ బీమా ఏర్పాటు చేసుకుందామన్నారు. 55 ఏళ్లు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చినా కరెంట్ కష్టాలు ఉండేవన్నారు. హైదరాబాద్ నగరం బాగుండాలంటే బలమైన నాయకత్వం, స్థిరమైన పభుత్వం ఉండాలని పేర్కొన్నారు. బండారి లక్ష్మారెడ్డి గెలుపు 100 శాతం పక్కా అన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంటీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడురి శ్రీనివాస్, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, శాంతి సాయిజెన్‌శేఖర్, బన్నాల గీతా ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆందోళనకరంగా చిన్నారుల్లో ఎదుగుదల లోపాలు

సాక్షి, సిటీబ్యూరో: చిన్నారుల్లో ఎదుగుదల లోపాలు ఆందోళనకర స్థాయికి చేరాయని వైద్య నిపుణులు అభిప్రాయపడ్డారు. వైద్య పరిశోధనలు, ఆవిష్కరణలకు పేరొందిన అబ్బోట్ ఆధ్వర్యంలో బేగంపేట్‌లోని తాజ్ వివంతా హోటల్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. పోషకాహారలోపం చిన్నారుల్లో ఎదుగుదలపై ప్రభావం చూపుతున్న అంశంపై నిర్వహించిన ఈ సమావేశంలో అమెరికాకు చెందిన పీడియాట్రిక్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ పెడ్రో అలార్కన్ మాట్లాడుతూ.. ఎదుగుదల లోపాలపై తల్లిదండ్రుల్లో అవగాహన పెరగాలన్నారు. పోషకాహార సప్లిమెంట్స్‌లో కొన్ని వెలితిని పూడ్చేవి కాగా కొన్ని ఆహారం ద్వారా వచ్చే పోషకాలను శరీరానికి వంటబట్టించేవి కూడా ఉన్నాయన్నారు. అబ్బోట్ వైద్య పరిశోధన విభాగానికి చెందిన డా. గణేష్ కాథె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఐదేళ్ల లోపు చిన్నారుల్లో 149 మిలియన్ల మంది ఎదుగుదల లోపాలు కనిపిస్తున్నాయని తేలిందన్నారు. దీన్ని నివారించడానికి మాక్రో న్యూట్రియంట్స్, మైక్రో న్యూట్రియంట్స్ సరైన మేళవింపుతో ఆహారాన్ని చిన్నారులకు అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. యశోద ఆసుపత్రికి చెందిన పిడియాట్రిక్స్ విభాగ వైద్యులు డా.డి.రమేష్ మాట్లాడుతూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్‌ఐఎన్) తాజా అధ్యయనం ప్రకారం రాష్ట్రంలోని నగరాల్లో 33.8 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో 33శాతం మంది చిన్నారుల్లో ఎదుగుదల లోపాలు ఉన్నట్టు తేలిందన్నారు. పండ్లు, 5రకాల కూరగాయలు, ప్రొటీన్, పాలు సంబంధిత ఉత్పత్తులు, తృణ ధాన్యాలు మేళవింపుతో ఆహారాన్ని చిన్నారులకు అలవాటు చేయడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చునన్నారు. సమావేశంలో పలువురు వైద్య, పోషకాహార నిపుణులు పాల్గొన్నారు.



# పటిష్ట భద్రత

- ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద మహిళా సిబ్బంది
- ఇప్పటికే పని చేస్తున్న 45 ఫ్లయింగ్ స్క్వాడ్స్
- అవసరమైన స్థాయిలో క్యూఆర్‌టీ బృందాలు
- అబ్జర్వర్లకు వివరించిన సిటీ పోలీసు కమిషనర్
- ఐసీసీసీలో సమీక్ష సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: ఓటింగ్ జరిగే రోజు ప్రతి పోలింగ్ స్టేషన్ వద్దా కచ్చితంగా మహిళా పోలీసులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఎలక్షన్ అబ్జర్వర్లతో (జనరల్, పోలీసు, ఎక్స్‌పెండిచర్) గురువారం కొత్వాల్‌తో పాటు జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ భేటీ అయ్యారు. బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఈ సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో పోలీసు, జీహెచ్‌ఎంసీ, ఎన్నికల అధికారులు తాము తీసుకుంటున్న చర్యలను అబ్జర్వర్లకు వివరించారు. ఈసారి నిఘా కోసం ప్రత్యేక, అత్యాధునిక టెక్నాలజీ వాడుతున్నట్లు రోనాల్డ్ రాస్ వివరించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ స్టేషన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నామని, ఈవీఎంలను తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. సుమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద కేంద్ర సాయుధ బలగాలను మోహరిస్తున్నామని కొత్వాల్ సందీప్ శాండిల్య పేర్కొన్నారు. వీటికి అదనంగా 391 రూట్ మొబైల్స్ ఏర్పాటు చేశామని, ఒక్కో దాంట్లో ఒక కానిస్టేబుల్‌తో పాటు ముగ్గురు సాయుధ బలగాల సిబ్బంది ఉంటారని వివరించారు.

**129 పెట్రోలింగ్ వాహనాలు**

- నగర కమిషనరేట్ పరిధిలో ఉన్న 129 పెట్రోలింగ్ వాహనాలు, 220 బ్లూకోల్ట్స్‌తో పాటు అదనంగా ఏర్పాటు చేసిన మరో 122 వాహనాలు క్షేత్ర స్థాయిలోనే ఉంటూ, డయల్-100కు వచ్చిన కాల్స్‌పై తక్షణం స్పందిస్తున్నారని అబ్జర్వర్లకు తెలిపారు. ప్రస్తుతం నగర వ్యాప్తంగా 45 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 45 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్‌తో పాటు అవసరమైన ప్రాంతాల్లో స్టాటిక్ పికెట్లు ఏర్పాటు చేశామని, ఇప్పటి కొన్నాళ్లుగా పని చేస్తున్నాయని వివరించారు. ఏడుగురు డీసీపీలు, 28 మంది ఏసీపీ స్థాయి అధికారులతో ఏర్పాటు చేస్తున్న స్ట్రైకింగ్ ఫోర్స్‌లు పోలింగ్‌కు నిర్ణీత కాలం ముందు నుంచే విధుల్లో ఉంటాయని సందీప్ శాండిల్య పేర్కొన్నారు.
- టాస్క్‌ఫోర్స్, స్పెషల్ ఫోర్సెస్‌కు చెందిన తొమ్మిదేసి బృందాలు, 71 మంది ఇన్‌స్పెక్టర్లు, 125 మంది సబ్-ఇన్‌స్పెక్టర్లతో కూడిన క్విక్ రెస్పాన్స్ టీమ్స్ (క్యూఆర్టీ) రంగంలోకి దిగనున్నాయని తెలిపారు. నగర వ్యాప్తంగా 144వ సెక్షన్ విధించడంతో పాటు ప్రతి ఒక్కరూ ఓటు వేసిన వెంటనే తిరిగి ఇళ్లకు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఏ చిన్న ఉదంతం జరిగినా సత్వరం లేదా అవసరమైన స్థాయిలో స్పందించని అధికారులకు చర్యలు తీసుకుంటున్నామని కొత్వాల్ సందీప్ శాండిల్య స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు సీపీ (శాంతి భద్రతలు) విక్రమ్ సింగ్ మాన్, సంయుక్త సీపీ (స్పెషల్ బ్రాంచ్) పి.విశ్వప్రసాద్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సంయుక్త సీపీ (పరిపాలన) పరిమళ హన నూతన్, జీహెచ్‌ఎంసీలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్న ఐపీఎస్ అధికారి ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల పరిశీలకులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

## మోదీ..షా

- గ్రేటర్‌లో బీజేపీ నేతల మకాం
- నేడు అమిత్‌షా.. రేపు మోదీ రాక
- ఇప్పటికే నగరంలో పలువురు కేంద్ర మంత్రులు
- శివారు నియోజక వర్గాలపై ఫుల్ ఫోకస్



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌పై బీజేపీ ఫుల్ ఫోకస్ పెట్టింది. సంస్థాగతంగా పార్టీకి గట్టిపట్టున్న కోర్‌సిటీ సహ శివారు నియోజకవర్గాలపై దృష్టి సారించింది. ఎలాగైనా ఆయా స్థానాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలనే తపనతో.. వారి తరపున ప్రచారం చేసేందుకు ఆ పార్టీ అగ్రనేతలు ఇక్కడికి క్యూ కడుతున్నారు. ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులు నగరంలో పర్యటిస్తున్నారు. బీజేపీ అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్నారు. తాజాగా శుక్రవారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, శనివారం ప్రధాని మోదీ నగరానికి చేరుకోనున్నారు. హోం మంత్రి అమిత్‌షా 25న ఉదయం 11.30 గంటలకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు. అదే విధంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కూడా హైదరాబాద్ రానున్నారు. ఆయన ఉదయం 11 గంటలకు మేడ్చల్, కంటోన్మెంట్, కార్వాన్ నియోజకవర్గాల్లో నిర్వహించే బహిరంగ సభల్లో ఆయన పాల్గొననున్నారు. అదే విధంగా మధ్యాహ్నం 2.10 గంటలకు హోంమంత్రి అమిత్‌షా రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, అంబర్‌పేట నియోజకవర్గాల్లో రోడ్‌షో నిర్వహించనున్నారు. రాత్రి ఐటీసీ కాకతీయలో బస చేసి, 25న ఉదయం కొల్లాపూర్ వెళ్లనున్నారు. అటు నుంచి మునుగోడు, పటాన్‌చెరుకు వెళ్లనున్నారు. రాత్రి ఏడు గంటలకు ఖైరతాబాద్‌లో రోడ్‌షో నిర్వహించనున్నారు. అదే విధంగా 26న సాయంత్రం కూకట్‌పల్లిలో రోడ్‌షో నిర్వహించనున్నారు. 25న మహేశ్వరం నియోజకవర్గంలో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. సాయంత్రం ఐదు గంటలకు తుక్కుగూడ వేదికగా నిర్వహించే బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. రాత్రి రాజ్‌భవన్‌లో బస చేయనున్నారు. ఆ తర్వాత వరుసగా రెండు రోజుల పాటు నగరంలో రోడ్డు షోలు నిర్వహించనున్నారు. 26న ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ కల్వకుర్తి నియోజకవర్గంలో పర్యటించనున్నారు.